సాక్షి
ఆదిలాబాద్
శుక్రవారం । 1 । మార్చి । 2024



కడెం.. డెడ్ స్టోరేజీ
కడెం ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరింది. డెడ్ స్టోరేజీ లెవెల్ 675 అడుగులు కాగా, 677 అడుగుల నీరుంది. 8లో▸



గంజాయి స్మగ్లింగ్‌లో కిలేడీ
ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న ఓ మహిళ పోలీసులకు చిక్కింది. 28కిలోల గంజాయితో పట్టుబడింది. 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
36.0/24.0

వాతావరణం
ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం వేడిగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తగ్గుతుంది.

న్యూస్‌రీల్

పథకాలతో పేదరిక నిర్మూలన



కార్యక్రమంలో మాట్లాడుతున్న సబిత

ఆదిలాబాద్‌టౌన్: సంక్షేమ పథకాల ద్వారా పేదరికాన్ని నిర్మూలించవచ్చని జిల్లా సంక్షేమాధికారి సబిత పేర్కొన్నారు. గురువారం మహిళా శిశుసంక్షేమశాఖ మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బంగారిగూడ నుంచి ఆరుగురు ఆడపిల్లలకు సుకన్య సమృద్ధి యోజన పథకం ద్వారా దస్నాపూర్ పోస్టాఫీస్‌లో ఖాతాలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడ పిల్లల చదువు, వివాహం కోసం సుకన్య సమృద్ధి పథకం ఉపయోగపడుతుందని వివరించారు. ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిల్, జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి, కోటేశ్వర్ తదితరులున్నారు.

సెకండియర్ పరీక్షలు షురూ..

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. 9,347 మంది విద్యార్థులకు 8,855 మంది హాజరు కాగా, 492 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఐఈవో రవీందర్‌కుమార్ తెలిపారు.

శిక్షణ వినియోగించుకోవాలి



శిక్షణను పరిశీలిస్తున్న డీఈవో ప్రణీత

ఆదిలాబాద్‌టౌన్: ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, సీసీవోలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో ప్రణీత సూచించారు. గురువారం పట్టణంలోని గెజిటెడ్ నంబర్ 2లో ఆధార్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ గురించి హైదరాబాద్ నుంచి టెక్నికల్ రిసోర్స్ పర్సన్ ప్రవీణ్ శిక్షణ ఇచ్చారు. డీఈవో కార్యాలయ సూపరింటెండెంట్ మమత, సెక్టోరియల్ అధికారి నారాయణ, స్టాటిస్టికల్ కోఆర్డినేటర్ ఉస్మాన్, ఏపీవో సందీప్, టెక్నికల్ పర్సన్ సలీమ్ పాల్గొన్నారు.

చెవిలో పూలతో నిరసన



చెవిలో పూలతో శిబిరంలో నిరసన తెలుపుతున్న కమిటీ సభ్యులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ రైల్వేలైన్ ఏర్పాటుకు నిధులు విడుదల చేయాలనే డిమాండ్‌తో రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్ష గురువారం 45వ రోజుకు చేరింది. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడాన్ని నిరసిస్తూ సభ్యులు చెవిలో పూలతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ సిర్ర దేవేందర్, ప్రధాన కార్యదర్శి నిమ్మల నరేందర్, నాయకులు అఫ్సర్‌ఖాన్, రఫీక్, రాజుయాదవ్, శ్రీనివాస్, భాస్కర్, రాములు, గణేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ డీడీ, ఏటీడీవోకు చార్జ్ మెమో జారీ చేయాలి

- గిరిజన సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న బాలిక తొడసం మహేశ్వరి బుధవారం జ్వరంతో మృతి చెందడంపై గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శరత్ ఆరా తీసినట్లు తెలిసింది. గురువారం ఐటీడీఏ డీడీ దిలీప్‌తో పాటు జిల్లాలోని ఏటీడీవో, హెచ్‌ఎం, వార్డెన్, డిప్యూటీ వార్డెన్‌తో జూం మీటింగ్ నిర్వహించారు. గిరిజన సంక్షేమశాఖ పరిధిలో పని చేస్తున్న ఉద్యోగులు విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. హెచ్‌ఎం, క్లాస్ టీచర్, ఏఎన్‌ఎంను సస్పెండ్ చేయాలని సూచించినట్లు సమాచారం. అలాగే సంబంధిత ఏటీడీవో, డీడీకి చార్జ్ మెమో జారీ చేయాలని ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయ ఉద్యోగికి సూచించినట్లు తెలిపింది. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించినట్లు సమాచారం. ఉపాధ్యాయులకు జీపీఎస్ కెమెరా అటెండెన్స్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. ఇకముందు ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

‘మెగా’ సంబురం



జిల్లాలో భర్తీ కానున్న పోస్టులు

ఎస్‌ఏ	80
ఎస్జీటీ	228
ఎల్‌పీ	14
పీఈటీ	2
మొత్తం	324

భాషా పండిత పోస్టుల వివరాలు

యాజమాన్యం	సబ్జెక్టు	పోస్టులు
ప్రభుత్వ	హిందీ	1
లోకల్‌బాడీ	మరాఠీ	2
ప్రభుత్వ	తెలుగు	6
లోకల్‌బాడీ	తెలుగు	3
లోకల్‌బాడీ	ఉర్దూ	2
మొత్తం		14

ఉమ్మడి జిల్లా వివరాలు.. ఉమ్మడి జిల్లాలో సబ్జెక్టులవారీగా ఖాళీల వివరాలు..

జిల్లా	ఎస్‌ఏ	లాంగ్వేజ్ పండిట్	పీఈటీ	ఎస్జీటీ	ఎస్‌ఏ (ప్రత్యేక)	ఎస్జీటీ (ప్రత్యేక)	మొత్తం
నిర్మల్	70	04	04	236	05	23	342
ఆదిలాబాద్	74	14	02	209	06	19	324
మంచిర్యాల	70	16	03	176	05	18	288
కుమురంభీం	62	25	02	234	03	15	341

పీఈటీ పోస్టుల వివరాలు

యాజమాన్యం	సబ్జెక్టు	పోస్టులు
ప్రభుత్వ	హిందీ మీడియం	1
ప్రభుత్వ	తెలుగు మీడియం	1
మొత్తం		2

స్కూల్ అసిస్టెంట్ పోస్టుల వివరాలు

యాజమాన్యం	సబ్జెక్టు	పోస్టులు
లోకల్ బాడీ	బయోసైన్స్ (మరాఠీ)	1
ప్రభుత్వ	బయోసైన్స్ (తెలుగు)	1
లోకల్‌బాడీ	బయోసైన్స్ (తెలుగు)	11
లోకల్‌బాడీ	బయోసైన్స్ (ఉర్దూ)	1
ప్రభుత్వ	ఇంగ్లిష్	2
లోకల్‌బాడీ	ఇంగ్లిష్	6
లోకల్‌బాడీ	హిందీ	2
లోకల్‌బాడీ	గణితం (మరాఠీ)	2
ప్రభుత్వ	గణితం (తెలుగు)	1
లోకల్‌బాడీ	గణితం (తెలుగు)	5
ప్రభుత్వ	గణితం (ఉర్దూ)	1
లోకల్‌బాడీ	గణితం (ఉర్దూ)	1
లోకల్‌బాడీ	మరాఠీ	1
ప్రభుత్వ	ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగు)	1
లోకల్‌బాడీ	ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగు)	1
లోకల్‌బాడీ	ఫిజికల్‌సైన్స్ (మరాఠీ)	1
ప్రభుత్వ	ఫిజికల్‌సైన్స్ (తెలుగు)	1
లోకల్‌బాడీ	ఫిజికల్‌సైన్స్ (తెలుగు)	2
ప్రభుత్వ	ఫిజికల్‌సైన్స్ (ఉర్దూ)	2
లోకల్‌బాడీ	ఫిజికల్‌సైన్స్ (ఉర్దూ)	1
లోకల్‌బాడీ	సాంఘిక (మరాఠీ)	2
ప్రభుత్వ	సాంఘిక (తెలుగు)	2
లోకల్‌బాడీ	సాంఘిక (తెలుగు)	18
ప్రభుత్వ	సాంఘిక (ఉర్దూ)	1
లోకల్‌బాడీ	సాంఘిక (ఉర్దూ)	1
లోకల్‌బాడీ	తెలుగు	5
లోకల్‌బాడీ	ఉర్దూ	1
ప్రభుత్వ	స్పెషల్ ఎడ్యుకేషన్ (తెలుగు)	1
లోకల్‌బాడీ	స్పెషల్ ఎడ్యుకేషన్ (తెలుగు)	4
లోకల్‌బాడీ	స్పెషల్ ఎడ్యుకేషన్ (ఉర్దూ)	1
మొత్తం		80

ఎస్జీటీ పోస్టుల వివరాలు

యాజమాన్యం	సబ్జెక్టు	పోస్టులు
ప్రభుత్వ	హిందీ మీడియం	5
లోకల్‌బాడీ	హిందీ మీడియం	1
ప్రభుత్వ	మరాఠీ మీడియం	4
లోకల్‌బాడీ	మరాఠీ మీడియం	10
ప్రభుత్వ	తెలుగు మీడియం	17
లోకల్‌బాడీ	తెలుగు మీడియం	131
ప్రభుత్వ	ఉర్దూ మీడియం	10
లోకల్‌బాడీ	ఉర్దూ మీడియం	31
ప్రభుత్వ	స్పెషల్ ఎడ్యుకేషన్ (తెలుగు)	1
లోకల్‌బాడీ	స్పెషల్ ఎడ్యుకేషన్ (తెలుగు)	18
మొత్తం		228

- డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల
- 324 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్
- ఎస్‌ఈ పోస్టులూ కేటాయింపు
- ఏప్రిల్ 2వరకు దరఖాస్తు గడువు
- గతంలో దరఖాస్తు చేస్తే మళ్లీ వద్దు
- గత నోటిఫికేషన్ రద్దు చేసిన సర్కార్

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 11,062 పోస్టులు భర్తీ చేయనుంది. జిల్లాలో 324 ఖాళీలను భర్తీ చేయనున్నారు. గత ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ బుధవారం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. చివరిసారిగా 2017లో డీఎస్సీ నిర్వహించగా, అప్పటి నుంచి ఉపాధ్యాయ పోస్టులు భర్తీకి నోచుకోలేదు. సెప్టెంబర్‌లో గత ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినా ఎన్నికల కోడ్ కారణంగా భర్తీ ప్రక్రియ నిలిచింది. కాగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం గత పోస్టులతో పాటు కొత్త పోస్టులను కలిపి తాజాగా నోటిఫికేషన్ జారీ చేయగా నిరుద్యోగుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పలువురు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు సిద్ధపడుతున్నారు. మరికొందరు దగ్గరలోని కోచింగ్ సెంటర్లకు పరుగులు పెడుతున్నారు.

4వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 4నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు అధికారులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది. కొత్తగా దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు రూ.వెయ్యి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించనున్నారు.

తొలిసారిగా ఎస్‌ఈ పోస్టులు

ఇదివరకు చాలామంది స్పెషల్ ఎడ్యుకేషన్ చేసినప్పటికీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో వారిలో నిరాశే మిగిలింది. ప్రస్తుతం కాంగ్రెస్ సర్కార్ తొలిసారి ఆదిలాబాద్ జిల్లాలో ఆరుస్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 19 ఎస్జీటీ పోస్టులు కేటాయించింది. చాలామంది ప్రస్తుతం స్పెషల్ బీఈడీ చేసినవారు భవిత సెంటర్లలో ప్రత్యేకావసరాలు గల పిల్లలకు బోధిస్తున్నారు. ఇంకొందరు రీహాబిటేషన్ సెంటర్లలో ప్రైవేట్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ఈ పోస్టుల కేటాయింపు వారిలో ఆనందం నింపినా.. ఏళ్లుగా భవిత సెంటర్లలో పనిచేస్తున్న వారికి వెయిటేజీ ఇవ్వకపోవడం నిరాశకు గురి చేస్తోంది.

‘నిమిషం నిబంధన వద్దు’



డీఐఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్మీడియట్ పరీక్షల్లో నిమిషం ఆలస్యం నిబంధన తొలగించాలని విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో డీఐఈవో రవీందర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల జేఏసీ కన్వీనర్ బీ రాహుల్ మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థి టీకం శివకుమార్ ‘నిమిషం’ నిబంధన కారణంగా పరీక్షకు దూరమై మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిమిషం ఆలస్యం నిబంధన ఎత్తివేస్తూ శివకుమార్ కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి కుంటాల నవీన్‌కుమార్, టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్, ఏఎస్‌యూ జిల్లా కార్యదర్శి అశోక్, టీఎస్‌ఎఫ్ నాయకుడు సత్యనారాయణ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడం సాయికుమార్, ఎస్‌వీఏ జిల్లా అధ్యక్షుడు గొప్లే సుజయ్, నాయకులు ఇఫ్తెఖార్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి కుటుంబాన్ని ఆదుకోవాలి

ఎదులాపురం: ఇంటర్ విద్యార్థి శివకుమార్ కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్ డిమాండ్ చేశారు. రిమ్స్ మార్చురీలో శివకుమార్ మృతదేహాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఆయన కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షకు సంబంధించి నిమిషం ఆలస్యం నిబంధన విద్యార్థుల పాలిట శాపంగా మారిందని పేర్కొన్నారు. నిమిషం నిబంధన వెంటనే ఎత్తి వేయాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు ఆత్రం కిష్టన్న, లక్ష్మణ్ తదితరులున్నారు.

మోదీ పర్యటన ఏర్పాట్లు వేగిరం



స్టేడియంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

- బహిరంగ సభ వేదికగా స్టేడియం
- విమానాశ్రయ మైదానంలో ఐదు హెలిప్యాడ్లు సిద్ధం

సాక్షి, ఆదిలాబాద్/కైలాస్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ ఈనెల 4వ తేదీన జిల్లా కేంద్రానికి రానుండగా ఏర్పాట్లు వేగిరమయ్యాయి. అధికారిక కార్యక్రమాలతోపాటు రాజకీయ ప్రచార కార్యక్రమం ఉండగా అధికారులు, పార్టీ నాయకులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బహిరంగ సభ నిర్వహించనున్నారు. విమానాశ్రయ మైదానంలో ఐదు హెలిప్యాడ్లు సిద్ధం చేస్తున్నారు. స్టేడియం, విమానాశ్రయ మైదానంలో ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ట్రైనీ కలెక్టర్ వికాస్ మహతో, డీఎస్పీ జీవన్‌రెడ్డి పరిశీలించారు. కాగా, బీజేపీ పది నియోజకవర్గాల సమావేశం గురువారం జిల్లా కేంద్రంలో జరిగింది. పీఎం మోదీ పర్యటన నేపథ్యంలో జనసమీకరణపై సమీక్షించారు. ఎంపీ సోయం బాపూరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అల్జాపూర్ శ్రీనివాస్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్, సీనియర్ నాయకులు భూమయ్య, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి తదితరులున్నారు. సమీక్ష అనంతరం స్టేడియం, విమానాశ్రయ మైదానంలో ఏర్పాట్లు పరిశీలించారు. రాష్ట్రానికి సంబంధించి పలు ప్రాజెక్టులు, ప్రారంభోత్సవాలు, జాతికి అంకితం చేసేలా వర్చువల్ పద్ధతిలో ప్రధాని అధికారిక కార్యక్రమాలు జరగనున్నాయి. ఏయే ప్రాజెక్టులను ఇందులో తీసుకుంటారనే విషయంలో శుక్రవారం స్పష్టతవచ్చే అవకాశముందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

వడ్డీ రాయితీ ఆఫర్

- ఆస్తిపన్ను వడ్డీపై 90శాతం రాయితీ
- ఓటీఎస్ కింద చెల్లింపునకు అవకాశం
- రూ.3.45 కోట్ల రాయితీ ప్రయోజనం

కైలాస్‌నగర్: ఆస్తి పన్ను బకాయిపడిన పట్టణ ప్రజలకు ప్రభుత్వం తీపికబురు అందించింది. గతేడాది మార్చి 31వ తేదీ వరకు ఉన్న పన్ను బకాయిల వడ్డీపై 90శాతం రాయితీ ప్రకటించింది. ఈ మేరకు పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి దాన కిశోర్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వడ్డీమాఫీ కోసం వన్‌టైం సెటిల్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో ఆదిలాబాద్ మున్సిపాల్టీ పరిధిలోని నివాస గృహాలు, వాణిజ్య, వ్యాపార సంస్థలకు సంబంధించి రూ.3.42 కోట్లు వడ్డీ రూపేణ మాఫీ అయ్యే అవకాశముంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా 90శాతం రాయితీ కల్పిస్తూ మిగతా 10 శాతం పన్నులను వసూలు చేసేదిశగా బల్దియా రెవెన్యూ విభాగం కసరత్తు చేస్తోంది.

‘పది’ శాతమే వసూలు

మరో నెల రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ఆస్తి పన్ను బకాయిల వసూళ్లపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రజలకు ప్రయోజనం కల్పించేలా వడ్డీపై 90శాతం రాయితీ కల్పిస్తోంది. ఆదిలాబాద్ మున్సిపల్ పరిధిలో 49 వార్డులుండగా నివాస గృహాలు, వ్యాపార, వాణిజ్యసంస్థలకు సంబంధించి 46,248 అస్తులున్నాయి. వీటిపై గతేదాది మార్చి 31వ తేదీ వరకు ఆస్తిపన్ను బకాయిలకు సంబంధించి వడ్డీ రూ.3.82 కోట్లు పెండింగ్‌లో ఉంది. వాటి వసూలుకు బల్దియా యంత్రాంగం చర్యలు చేపట్టింది. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వసూలు చేస్తోంది. తాజాగా ప్రభుత్వం ఈ వడ్డీపై 90శాతం రాయితీ కల్పిస్తున్నట్లు ప్రకటించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వడ్డీ బకాయిలను ఏకకాలంలో చెల్లించేలా వన్‌టైమ్ సెటిల్‌మెంట్ పథకాన్ని అమలు చేస్తోంది. ప్రజలు 90శాతం వడ్డీని మినహాయించుకుని 10శాతం చెల్లిస్తే సరిపోతోంది. ఈ లెక్కన 90శాతం రాయితీ రూపేణ రూ.3.45 కోట్ల రూపాయలు పట్టణ ప్రజలకు ఆదా అవుతున్నాయి. 10 శాతం చెల్లించినట్లయితే బల్దియాకు రూ.34.50లక్షలు మాత్రమే ఆదాయం సమకూరనుంది. అలాగే 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలను ప్రస్తుత ఆర్థికసంవత్సరంలో చెల్లించిన ప్రజలకు కూడా 90శాతం వడ్డీ రాయితీని వర్తింపజేయనున్నారు. అయితే ఈ రాయితీ మొత్తాన్ని తరువాత సంవత్సరంలో చెల్లించాల్సిన పన్నుల్లో సర్దుబాటు చేయనున్నారు.



ఆదిలాబాద్ పట్టణ ముఖచిత్రం

సద్వినియోగం చేసుకోవాలి

ఆస్తిపన్ను వడ్డీపై ప్రభుత్వం 90శాతం రాయితీ కల్పించింది. ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు ఎవరైతే ఆస్తిపన్ను చెల్లించకుండా బకాయి పడ్డారో వారందరికీ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకుని 10 శాతం వడ్డీతో బకాయిలు చెల్లించాలి. ఇంటికి వచ్చే బల్దియా సిబ్బందికి గాని, మున్సిపల్ కార్యాలయంలో గాని సంప్రదించి పన్నులు చెల్లించవచ్చు. సీడీఎంఏ వెబ్‌సైట్‌లోని ప్రాపర్టీ ట్యాక్స్ యాప్‌లోనూ ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించే అవకాశముంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
– జాదవ్ కృష్ణ, బల్దియా రెవెన్యూ అధికారి

రూ.220 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలో రూ.220కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ, రూ.450 కోట్లతో ఆదిలాబాద్ నుంచి బేల మీదుగా మహారాష్ట్ర వైపు నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులకు ప్రధాని మోదీ ఈ నెల 4న శంకుస్థాపన చేస్తారని ఎంపీ సోయం బాపూరావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. ప్రధాని పర్యటన ఏర్పాట్లపై గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రధానిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి తొలిసారి జిల్లాకు వస్తున్న మోదీ పర్యటనను విజయవంతం చేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంతో జిల్లాలోని పేదప్రజలకు మోదీ ఎంతో మేలు చేశారన్నారు. రూ.కోట్లు వెచ్చించి చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని పేర్కొన్నారు. అనంతరం ఏరోడ్రమ్ మైదానంలో జరిగే బహిరంగ సభలో ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నట్లు తెలిపారు. ప్రజలు, పార్టీ శ్రేణులు అధికసంఖ్యలో వచ్చి విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హెలిప్యాడ్ ఏర్పాట్లను పోలీస్ అధికారులతో కలిసి పరిశీలించారు. జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, నాయకులు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, అల్జాపూర్ శ్రీనివాస్, పతంగే బ్రహ్మానంద్ తదితరులున్నారు.

జీవో 3పై స్పష్టమైన ప్రకటన చేయాలి

ఎదులాపురం: గిరిజన ప్రాంత ఉద్యోగాల్లో గిరిజన యువతకు వందశాతం రిజర్వేషన్ కల్పించే జీవో 3పై రాష్ట్రపతి ఆర్డినెన్స్ జారీ చేయాలని, జిల్లాకు వస్తున్న ప్రధాని మోదీ దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన టీఏజీఎస్ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం కరోనా కాలంలో దొంగ దారిన జీవో 3ను రద్దు చేసి ఏజెన్సీ గిరిజన యువతకు తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఆదివాసీలు అధికంగా ఉన్న ఆదిలాబాద్ జిల్లాలో ఉట్నూర్ కేంద్రంగా గిరిజన సెంట్రల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని, నూతన అటవీ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తొడసం భీంరావ్, జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు, ఉపాధ్యక్షుడు లంకా రాఘవులు, నాయకులు మడావి నాగోరావ్, ఆత్రం కిష్టన్న, కనక మల్కూ, కోవ సునీల్, మెస్రం మహేశ్, పెందోర్ నగేశ్ తదితరులున్నారు.

కొత్త యంత్రాంగం

- ఈసీ ఆదేశాలతో బదిలీలు కొలిక్కి
- జిల్లా అధికారుల్లో కొత్త ముఖాలు
- ఎక్సైజ్, రవాణా శాఖల్లో ప్రక్షాళన



కలెక్టర్ రాజర్షి షా



ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



ఎస్పీ గౌస్ ఆలం

సాక్షి, ఆదిలాబాద్: జిల్లా యంత్రాంగంలో దాదాపు అన్నీ కొత్త ముఖాలే. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో రెవెన్యూ, పోలీస్, ఎక్సైజ్, పంచాయతీరాజ్ శాఖల్లో బదిలీలు చోటుచేసుకున్నాయి. ఇవి దాదాపుగా పూర్తయినట్లే. రవాణాశాఖలో ఇటీవల డీటీసీతో పాటు ఎంవీఐ, ఏఎంవీఐలను పూర్తిస్థాయిలో బదిలీ చేశారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు ఈసీ ఆదేశాలతో పలు శాఖల్లో బదిలీలు జరగగా, మరికొన్ని శాఖల్లో దీర్ఘకాలికంగా బదిలీలు లేకపోవడంతో ఇవి చోటుచేసుకున్నాయి.

ఇటీవలి బదిలీలు ఇలా..

ఇక్కడి కలెక్టర్ రాహుల్‌రాజ్‌ను మెదక్ కలెక్టర్‌గా బదిలీ చేశారు. అక్కడ కలెక్టర్‌గా ఉన్న రాజర్షిషా ఆదిలాబాద్ కలెక్టర్‌గా రానున్నారు. ఈనెల 4వ తేదీన ప్రధాని మోదీ జిల్లా పర్యటన ఉండగా ప్రస్తుతం ఉన్న కలెక్టర్ అప్పటివరకు కొనసాగుతారా.. లేనిపక్షంలో కొత్త కలెక్టర్ అంతకుముందే బాధ్యతలు చేపడతారా.. అనేది వేచిచూడాల్సిందే. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఖుష్బూ గుప్తా కొద్దిరోజుల పాటు ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా వ్యవహరించగా, ఇటీవల ఆమెకు పీవోగా పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఇన్‌చార్జి అదనపు కలెక్టర్‌గా కూడా ఆమె కొనసాగుతున్నారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి జనవరిలో బదిలీ కాగా, నూతన ఎస్పీగా అప్పట్లోనే ములుగు నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చిన గౌస్ ఆలం ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ శాఖలో అదనపు ఎస్పీ (ఆపరేషన్) సురేందర్‌రావు, ఆదిలాబాద్ డీఎస్పీగా జీవన్‌రెడ్డి ఇటీవలే బాధ్యతలు చేపట్టారు. డీఆర్డీవో కిషన్ మంచిర్యాలకు బదిలీ కాగా, ఆ స్థానంలో కామారెడ్డి నుంచి జీ సాయన్న వచ్చారు. ఈ శాఖలో ఏపీడీలు చరణ్‌దాస్, రవీందర్ రాథోడ్ బదిలీ కాగా, ఆ స్థానాల్లో కుటుంబరావు, శ్రీనివాస్ వచ్చారు. ఆదిలాబాద్ మున్సిపల్ కమిషనర్ శైలజ బదిలీ కాగా, ఆ స్థానంలో బోధన్ నుంచి ఎండీ ఖమర్ అహ్మద్ ఇటీవలే బాధ్యతలు స్వీకరించారు. తాజాగా ఆదిలాబాద్ ఆర్డీవో స్రవంతి బదిలీ కాగా, ఆ స్థానంలో మెదక్ నుంచి బదిలీపై వస్తున్న జీ అంబదాస్ రాజేశ్వర్ బాధ్యతలు స్వీకరించాల్సి ఉంది. ఖాళీగా ఉన్న ఐసీడీఎస్ పీడీ పోస్టులో ఇటీవలే సబిత బాధ్యతలు స్వీకరించారు. జెడ్పీ సీఈవో గణపతి మంచిర్యాలకు బదిలీ కాగా, ఆ స్థానంలో ఆసిఫాబాద్ నుంచి టీడీ రత్నమాల ఇక్కడికి వచ్చారు. డిప్యూటీ సీఈవో రాజేశ్వర్ రాథోడ్ పెద్దపల్లికి బదిలీ కాగా, ఆ స్థానంలో నల్గొండ నుంచి వచ్చిన ఎం.కలిందిని బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ నిర్మల్‌కు బదిలీ కాగా, అక్కడినుంచి శ్రీలత బదిలీపై ఇక్కడకు వచ్చారు. రవాణాశాఖలో ఉమ్మడి జిల్లా ఉప రవాణాధికారి పుప్పాల శ్రీనివాస్ హన్మకొండకు బదిలీ కాగా, ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మెదక్‌కు బదిలీ కాగా, ఆ స్థానంలో ఎవరినీ నియమించకపోగా, ప్రస్తుత డీసీ నర్సింహారెడ్డికే ఆ బాధ్యతలు అప్పగించారు.

ఈ శాఖల్లో ప్రక్షాళన

ఎన్నికల కమిషన్ ఆదేశాలతో తొలిసారిగా ఎక్సైజ్ శాఖలోనూ బదిలీలు పెద్ద ఎత్తున చోటు చేసుకున్నాయి. సీఐలు, ఎస్సైల ట్రాన్స్‌ఫర్లు జరిగాయి. వారి స్థానాల్లో కొత్త అధికారులు బాధ్యతలు స్వీకరించారు. రవాణాశాఖలో దీర్ఘకాలికంగా బదిలీలు లేకపోవడంతో ఇటీవల స్థానచలనం కల్పించారు. పలువురు ఎంవీఐలు, ఏఎంవీఐల బదిలీలు చోటు చేసుకున్నాయి. పోలీస్ శాఖలోనూ పలువురు సీఐలు, ఎస్సైల బదిలీలు జరిగాయి. జిల్లా ఉన్నతాధికారులతోపాటు క్షేత్రస్థాయిలోనూ పలువురు కొత్త అధికారులు బాధ్యతలు చేపట్టారు. నూతన అధికారులు, క్షేత్రస్థాయిలోనూ కొత్తదనం కనిపిస్తోంది.

క్లుప్తంగా

నిజాయతీ చాటుకున్న ఆలయ సిబ్బంది



బ్యాగు అప్పగిస్తున్న ఆలయ సిబ్బంది

భైంసా(ముథోల్): హైదరాబాద్‌కు చెందిన ఝాన్సీలక్ష్మి గురువారం బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి వచ్చి ఆలయ ప్రాంగణంలో బ్యాగు మర్చిపోయారు. అందులో 30 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.6వేల నగదు ఉన్నాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది బ్యాగును గమనించి ఉన్నతాధికారులకు అందించారు. అందులో ఉన్న ఐడీ ఆధారంగా భక్తురాలికి ఫోన్ చేశారు. ఆలయ సూపరింటెండెంట్ శివరాజ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ గంగాధర్ భక్తురాలికి బ్యాగును తిరిగి అప్పగించారు.

బాసరలో ఆర్‌అండ్‌బీ ఈఈ పూజలు



ఆలయంలో ఆర్‌అండ్‌బీ ఈఈ మోహన్

భైంసా: బాసర సరస్వతీ అమ్మవారిని ఆర్‌అండ్‌బీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మోహన్ నాయక్ గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో అధికారులతో కలిసి అమ్మవారికి అభిషేక పూజలు చేశారు. అనంతరం అర్చకులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ క్షేత్రపర్యటనలో భాగంగా బాసర గ్రామంలోని బొర్రగణేశ్ ఆలయం నుంచి మహాలక్ష్మి ఆలయం, పాపహరేశ్వర ఆలయం, దత్తాత్రేయ ఆలయం నుంచి సరస్వతీ అమ్మవారి ఆలయం వరకు బైపాస్ సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. రూ.6 కోట్లతో ఈ సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. బైపాస్ సీసీ రోడ్డు నిర్మాణం పూర్తయితే మండల కేంద్రానికి వచ్చే ప్రజల ఇబ్బందులు తీరుతాయని పేర్కొన్నారు.


రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

భైంసారూరల్: భైంసా–నిర్మల్ జాతీయ రహదారిపై మాటేగాం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. భైంసాలోని గోపాల్‌నగర్‌కు చెందిన విఠల్, ప్రీతమ్(12)తో కలిసి ద్విచక్ర వాహనంపై మాటేగాం వైపు వెళ్తుండగా వానల్‌పా డ్ నుంచి భైంసావైపు వస్తున్న టిప్పర్ ఢీకొ ట్టింది. బాలునికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108లో భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. తీవ్రగాయాలపాలైన విఠల్ చికిత్స పొందుతున్నాడు. భైంసారూరల్ పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు.

గుడుంబా పట్టివేత

పెంబి: ఎక్సైజ్ ఎస్సై వసంత్ రావు ఆధ్వర్యంలో పెంబి మండల కేంద్రంతో పాటు మందపల్లి, పెంబితాండ, ఇటిక్యాల్‌లో గురువారం తనిఖీలు నిర్వహించారు. పెంబిలో పెండల భీమేష్ వద్ద ఆరు లీటర్ల గుడుంబా లభించడంతో గుడుంబాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కడెం.. డెడ్ స్టోరేజీ



నీళ్లు లేక వెలవెలబోతున్న ప్రాజెక్ట్

- 3.116 టీఎంసీలకు చేరిన నీటి మట్టం
- గతేడాది 688.075 అడుగులు
- ప్రస్తుతం 677.475 అడుగులు

ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు(7.603 టీఎంసీ)
వరద గేట్లు 18, కాలువలు 2
ఆయకట్టు 68,150 ఎకరాలు(ఖరీఫ్)
డిస్ట్రిబ్యూటరీలు 42

కడెం: నిర్మల్, మంచిర్యాల జిల్లాల పరిధిలోని 68 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరందించే కడెం ప్రాజెక్టులో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరువైంది. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 7.603 టీఎంసీలు. ప్రస్తుతం 3.116 టీఎంసీలకు పడిపోయింది. వానాకాలం కడెం, దస్తురాబాద్, జన్నారం, దండెపల్లి, హాజీపూర్, లక్సెట్టిపేట మండలాల్లో 68 వేల ఎకరాలకు సాగునీరు అందించింది. నవంబర్, డిసెంబర్ నెలల్లో వర్షాలు కురవకపోవడం, ప్రాజెక్టు గేటు కొట్టుకుపోవడంతో నీటిమట్ట పడిపోయింది. యాసంగి పంటలకు నీరందించలేదు. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ క్రమంగా తగ్గుతూ డెడ్ స్టోరేజీకి చేరువైంది. గతేడాది ఫిబ్రవరి 28న, 688.075 అడుగుల నీటిమట్టం ఉండగా, ఈ ఏడాది ఫిబ్రవరి 28న 677.475 అడుగులుగా ఉంది.

భగీరథకు నీరందేనా?

మిషన్ భగీరథ పథకం ద్వారా కడెం, ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్ మండలాలకు నీరందించాల్సి ఉంది. మిషన్ భగీరథకు ప్రతీరోజు 09 క్యూసెక్కుల నీరు అవసరం. ప్రాజెక్ట్‌లో నీటి నిల్వ క్రమంగా తగ్గుతుండడంతో మిషన్ భగీరథ ఇంటెక్‌వెల్‌కు పూర్తి స్థాయిలో నీరందుతుందా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

యాసంగి బీడే..

వానాకాలంలో 68 వేల ఎకరాలకు సాగు నీరందించిన కడెం, యాసంగిలో కుడి, ఎడమ కాలువల ద్వారా కేవలం 25 వేల ఎకరాలకు సాగు నీటిని అందిస్తుంది. ఏడాది కంటే పది అడుగుల మేర నీటిమట్టం తగ్గడంతో ఈ యాసంగి పంటలకు సాగు నీరు ఇవ్వలేమని ప్రాజెక్ట్ అధికారులు ప్రకటించారు. బావులు ఉన్న రైతులు పంటలు సాగు చేయగా, కడెం నీటి విడుదల లేక వేల ఎకరాలు బీళ్లుగా మారాయి. కాలువలు, చెరువులపై ఆధారపడి పంటల సాగు చేసిన రైతులు సాగు నీటి కోసం తిప్పలు పడుతున్నారు. కడెం మండలం కన్నాపూర్, కొండుకూర్, బెల్లాల్, గ్రామ రైతులు కుడికాలువపై ఆధారపడి పంటలు సాగు చేశారు. ప్రాజెక్ట్‌లో నీటిమట్టం పడిపోవడంతో కాలువ నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది.

నీటి మట్టం తగ్గుతోంది..



కడెం ప్రాజెక్టులో నీటి మట్టం వేగంగా తగ్గుతోంది. డెడ్ స్టోరేజీ లెవెల్ 675 అడుగులు. ప్రస్తుతం 677 అడుగుల నీరు ఉంది. ప్రాజెక్టు మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. ఇటీవలే ప్రభుత్వం రూ.5.46 కోట్లు విడుదల చేసింది. టెండర్ పూర్తి కాగానే పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం.
– బోజదాసు, కడెం ప్రాజెక్టు డీఈ

టెండర్లు పూర్తయ్యేనా?

కడెం మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం జనవరి 29న, రూ.5.46 కోట్లు మంజూరు చేసింది. మొదటిసారి టెండర్లు పిలవగా కాంట్రాక్టర్లు ఎవరూ ముందుకు రాలేదు. రెండోసారి మళ్లీ టెండర్లు ఆహ్వానించారు. టెండర్ ప్రక్రియ ముగిసి వానాకాలం లోగా మరమ్మతులు పూర్తి చేస్తేనే కడెం ప్రాజెక్టు ఇబ్బందుల నుంచి బయటపడుతుంది. లేదంటే రెండేళ్లుగా వానాకాలంలో వచ్చినట్లు భారీ వరదలు వస్తే ముప్పు తప్పదు. గతంలో విడుదల చేసిన రూ.కోటితో ప్రస్తుతం వరద గేట్ల కౌంటర్ వెయిట్లు, స్పిల్‌వే కింద భాగం మరమ్మతులు చేస్తున్నారు.

‘గురుకుల’ ఫలితాల్లో ప్రతిభ

- రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన గణేశ్
- రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయినా.. ఆత్మస్థైర్యంతో ముందుకు



గణేశ్ బెల్లపు నగేశ్ అవినాశ్



అర్జున్ రజిత కార్యం సుప్రియ

ఆదిలాబాద్‌టౌన్/తాంసి: కృషి, పట్టుదల ఉంటే అనుకున్నది సాధించవచ్చని నిరూపించారు జిల్లాకు చెందిన బోడ్కుంటవార్ గణేశ్, బెల్లపు నగేశ్, నడికుంట్ల అవినాశ్. గణేశ్ 2018లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ కాలు కోల్పోయినప్పటికీ వెనుకడుగు వేయకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాడు. బుధవారం వెలువడిన గురుకుల డిగ్రీ ఫలితాల్లో ఆంగ్ల సబ్జెక్టుకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాడు. బేల మండల కేంద్రానికి చెందిన ఈయన ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ప్రభుత్వ లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. గ్రూప్స్, సివిల్‌కు సన్నద్ధమవుతున్న తరుణంలో డిగ్రీ గురుకుల నోటిఫికేషన్ రావడంతో పరీక్ష రాశాడు. లెక్చరర్‌గా మరోసారి సర్కారు కొలువు దక్కించుకున్నాడు. తాంసి మండల కేంద్రానికి చెందిన బెల్లపు నగేశ్ డిగ్రీ లెక్చరర్‌గా, భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నడికుంట్ల అవినాశ్ జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. నగేశ్ ప్రస్తుతం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని సైనిక్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నాడు. నడికుంట్ల అవినాష్ సైతం గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లోప్ ప్రతిభ కనబరిచి ఎకనామిక్స్ విభాగంలో జూనియర్ లెక్చరర్ గా ఉద్యోగం సాధించాడు. ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువకులను గ్రామస్తులు, ఉపాధ్యాయులు అభినందించారు.

బెల్లంపల్లి: బెల్లంపల్లి బస్తీకి చెందిన దేవునూరి అర్జున్ ఎంకామ్, బీఈడీ పూర్తి చేసి గురుకుల టీజీటీ, పీజీటీ, జూనియర్ లెక్చరర్ పోటీ పరీక్షలు రాశాడు. పీజీటీ సోషల్‌లో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు సాధించాడు. ఫిబ్రవరి 15న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఉద్యోగ నియామక పత్రం అందుకున్నాడు. గురువారం వెలువడిన గురుకుల జూనియర్ కామర్స్ లెక్చరర్ ఫలితాల్లో టీజీటీ సోషల్‌లో 185 మార్కులు సాధించి లెక్చరర్‌గా రెండో ఉద్యోగం సొంతం చేసుకున్నాడు. అంతకు ముందు 2019లో గ్రామ పంచాయతీ సెక్రెటరీ ఉద్యోగానికి ఎంపికై వారం రోజుల్లోనే రాజీనామా చేశాడు.

రెండు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు

నిర్మల్ రూరల్: నిర్మల్ రూరల్ మండలం నీలాయిపేట గ్రామానికి చెందిన మట్టె భూమన్న– రాజవ్వల కుమార్తె మట్టె రజిత గురువారం వెలువడిన గురుకుల జూనియర్ లెక్చరర్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్‌గా ఉద్యోగం సాధించింది. కొన్ని రోజుల క్రితం వెలువడిన పీజీటీ ఫలితాల్లోనూ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ ఉద్యోగం కూడా సాధించింది. ఒకే నెలలో రెండు ఉద్యోగాలు రావడంతో ఆనందంగా ఉందని రజిత పేర్కొంది. ప్రభుత్వ పాఠశాలలో చదివి, తల్లిదండ్రులు, భర్త ప్రోత్సాహంతో విజయం సాధించానని రజిత తెలిపారు.

మెదన్‌పూర్ యువతి..

కుంటాల: మండలంలోని మెదన్‌పూర్ గ్రామానికి చెందిన కార్యం సుప్రియ గురుకుల నియామక బోర్డు వెల్లడించిన ఫలితాల్లో మొదటి ప్రయత్నంలోనే జూనియర్ లెక్చరర్, పీజీటీ ఉద్యోగాలకు ఎంపికైంది. ఇంగ్లిష్ సబ్జెక్టులో రెండు ఉద్యోగాలు సాధించింది. తన మామయ్య కార్యం పెద్దరాజన్న, భర్త రాజు, కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఈ విజయం సాధ్యమైందని కార్యం సుప్రియ తెలిపారు.

మామిడిగూడ పాఠశాల హెచ్‌ఎం సస్పెన్షన్

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ ఆశ్రమ పాఠశాలలో పీజీ హెచ్‌ఎం ఏ.అశోక్ సస్పెండ్ అయ్యారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తొడసం మహేశ్వరి గత నెల 27న రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ ఘటనను నిరసిస్తూ ఆదివాసీ సంఘాలు ఆందోళన చేపట్టాయి. దీనిపై జిల్లా దళి తాభివృద్ధిశాఖ అధికారి సునీత కుమారిని కలెక్టర్ విచారణ అధికారిగా నియమించారు. వి ద్యార్థినికి వైద్యచికిత్సను అందించడంలో సద రు హెచ్‌ఎం నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లుగా డీఎస్‌డీవో అందించిన నివేదిక ఆధారంగా హెచ్‌ఎంను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ కలెక్టర్ రాహుల్ రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

పద్మశ్రీ కనకరాజుకు చికిత్స

- జైనూర్ నుంచి నిర్మల్ వరకూ వచ్చి..
- చికిత్స చేయించుకున్న గుస్సాడీ కళాకారుడు



కనకరాజు దంపతులను సన్మానిస్తున్న వైద్యులు

నిర్మల్: గుస్సాడీ నృత్యానికి జాతీయస్థాయి గుర్తింపు తీసుకువచ్చి, 2019లో పద్మశ్రీ అవార్డు అందుకున్న ఉమ్మడిజిల్లావాసి కనకరాజు ఓ సామాన్యుడిగా వచ్చి నిర్మల్‌లో వైద్యచికిత్స చేయించుకున్నారు. సదరు ఆస్పత్రి యాజమాన్యం ఉచితంగా వైద్య సేవలందించడంతో పాటు ఘనంగా సన్మానించింది. వివరాలను నిర్మల్ జిల్లాకేంద్రంలోని స్వప్న మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యుడు నాళం శశికాంత్ గురువారం వెల్లడించారు. కుమురంభీం జిల్లా జైనూర్ మండలానికి చెందిన కనకరాజు కొంతకాలంగా ఊపిరితిత్తులు, యూరాలజీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. మూడురోజుల క్రితం స్వప్నమల్టీస్పెషాలిటీ ఆస్పత్రికి వచ్చారు. ఆయనను పరీక్షించిన జనరల్ సర్జన్లు మల్లేశ్, శశికాంత్ ఉచితంగా ఆపరేషన్ చేశారు. పూర్తిగా కోలుకోవడంతో గురువారం ఆస్పత్రి వైద్యులంతా కలిసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైద్యులు నిఖిల్, స్వప్న, జగన్ పాల్గొన్నారు.

గంజాయి స్మగ్లింగ్‌లో కి‘లేడీ’

- ఒడిశా నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రకు సరఫరా
- మాన్కాపూర్ వద్ద పట్టుకున్న పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ భీమేశ్

గుడిహత్నూర్(బోథ్): గంజాయి స్మగ్లింగ్ చేస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు సీఐ భీమేశ్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఒడిశా రాష్ట్రంలోని మల్కన్‌గిరి ప్రాంతం నుంచి తెలంగాణ మీదుగా మహారాష్ట్రలోని ముంబై తదితర ప్రాంతాలకు పెద్ద మొత్తంలో గంజాయి రవాణా అవుతోందని యాంటీ నార్కొటిక్ బ్యూరో రెండు నెలలుగా నిఘా పెట్టింది. ఈ క్రమంలో సమాచారం అందుకున్న అధికారులు స్మగ్లర్‌ను పట్టుకోవడానికి యాక్షన్ మొదలు పెట్టారు. గురువారం స్థానిక ఎస్సై ఇమ్రాన్‌కు సమాచారం అందించారు. దీంతో పోలీసులు మఫ్టీలో ఆ ప్రాంతంలో కాపు కాశారు. మండలంలోని మాన్కాపూర్ లోని ఓ కూల్‌డ్రింక్ షాపు వద్ద నిలిచి ఉన్న జుపిటర్ స్కూటీని తీసుకెళ్లేందుకు వచ్చిన మహిళను అదుపులోకి తీసుకొని తనిఖీ చేశారు. దీంతో స్కూటీ డిక్కీలో 28 కిలోల గంజాయి లభ్యమైంది. దీని విలువ సుమారు రూ.8 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. సదరు మహిళ మహారాష్ట్రకు చెందిన వాశిం జిల్లాకు చెందిన మోహిని సంతోష్ ఠాక్రే అని, గతంలో ఇదే రూట్లో మూడు సార్లు స్మగ్లింగ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరిలో అర్జున్ అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి మహారాష్ట్రలోని వాశింకు చెందిన నితిన్ అనే వ్యక్తికి విక్రయిస్తోంది. అయితే 700 కి.మీ. దూరాన్ని స్కూటీపై ఒంటరిగా అటవీ మార్గం గుండా ఎవరికీ అనుమానం రాకుండా స్మగ్లింగ్ చేస్తుండడంతో స్థానికులు విస్తుపోయారు. మోహినిపై కేసు నమోదు చేసి నిందితురాలిని కోర్టులో హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై ఇమ్రాన్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల ‘పోస్ట్’

- తపాలా సేవలు విస్తరించినా మెరుగుపడని సౌకర్యాలు
- శిథిల భవనాల్లోనే కొనసాగింపు
- అధ్వాన్నంగా ఉద్యోగుల క్వార్టర్లు
- ఎక్కడా కానరాని సీసీ కెమెరాలు
- అద్దె భవనాల్లో బ్రాంచ్ పోస్టాఫీసులు



బెల్లంపల్లి సబ్ పోస్టాఫీసు భవనం

బెల్లంపల్లి: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పోస్టాఫీసులు సమస్యల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. దశాబ్దాలుగా సౌకర్యాల కల్పనకు నోచుకోవడం లేదు. పురాతన భవనాలు తప్పా కొత్త భవనాలకు మోక్షం కలగడం లేదు. అరకొర సౌకర్యాలు, అవస్థలతో పోస్టల్ ఉద్యోగులు అనివార్యంగా విధులు నిర్వహించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజలకు పలు రకాల సేవలు అందిస్తున్న పోస్టాఫీసులను పట్టించుకునే వారే కరువయ్యారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సేవలను విస్తరించిన అధికారులు అందుకు తగిన సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి.

ఇవీ పరిస్థితులు

ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్, మంచిర్యాలలో రెండు హెడ్ పోస్టాఫీసులు, వీటికి అనుబంధంగా 65 సబ్ పోస్టాఫీసులు ఉన్నాయి. వీటిలో సగానికి పైగా పక్కా భవనాలు లేవు. ప్రస్తుతం నిర్వహిస్తున్న భవనాలు అత్యంత శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎప్పుడు కూలి పోతాయో తెలియని పురాతన భవనాల్లో ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. పైకప్పు ఊడి పోయి కింద పడుతున్న భవనాలకు దశాబ్దాల నుంచి తాత్కాలిక మరమ్మతులు చేయించడం తప్పా కొత్త భవనాల ఊసెత్తక పోవడంతో పోస్టాఫీసుల కళ మారడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎనిమిదింటికి పక్కా భవనాలు ఉండగా మిగతా వాటిని అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఉన్న హెడ్‌పోస్టాఫీసు భవనం సరిగా లేకపోవడంతో అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంలో ఉన్న పోస్టాఫీసు భవనం పరిస్థితి ఈ తీరుగా ఉంటే మిగిలిన వాటి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు.

గ్రామీణ ప్రాంతాల్లో...

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో 525 బ్రాంచ్ పోస్టాఫీసులు ఉన్నాయి. వీటిలో దేనికీ సొంతగూడు లేదు. గ్రామాల్లో నివాసం ఉంటున్న పోస్టు మ్యాన్‌ల ఇళ్లలో, అద్దె భవనాల్లో వీటిని కొనసాగిస్తున్నారు. ఏళ్ల గడుస్తున్నా వీటి రూపురేఖలు మారకపోవడంతో అత్యంత దయనీయస్థితిలో ఉన్నాయి. గ్రామాల్లో తపాలా సేవలు గతంలో కన్న ఎంతగానో విస్తరించినప్పటికీ సరైన సౌకర్యాలు లేక పోస్టల్ సిబ్బంది, గ్రామీణులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు దాపురించాయి.

సిబ్బంది క్వార్టర్లు

పోస్టల్ ఉద్యోగులు, సిబ్బంది కోసం పోస్టాఫీసు ఆవరణలో దశాబ్దాల క్రితం అప్పటి పరిస్థితులకు అనుగుణంగా క్వార్టర్ల నిర్మాణం చేశారు. ఇరుకిరుకుగా గదులు ఉండడంతో జీవనం సాగించడానికి ఉ ద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. మౌలిక వసతులు అంతంత మాత్రంగానే ఉన్నాయని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులు ఆడుకోవడానికి ఖాళీ స్థలం లేక నాలుగు గోడల మధ్య, టీవీల ముందు కాలం గడుపుతున్నారు. ఆట విడుపు లేక మానసిక వేదనకు గురవుతున్నారు.

ఊసేలేని సీసీ కెమెరాలు

మారుతున్న కాలానికి అనుగుణంగా అన్నిరంగాల్లోనూ మార్పులు వస్తున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు ఇతర విభాగాల్లో తగినన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా ఆర్థిక లావాదేవీలు జరిగే బ్యాంకులు, ఇతర సంస్థల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతగానో ఉంది. కానీ పోస్టాఫీసుల్లో ఆ ఊసేలేకుండా పోయింది. సీసీ కెమెరాల ఆవశ్యకతను తపాలా శాఖ గుర్తించడం లేదు. ఒక్కో పోస్టాఫీసులో రోజువారీగా కనిష్టంగా రూ.20 లక్షల నుంచి గరిష్టంగా రూ.కోటి వరకు ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. అయినా ఉన్నతాధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోక పోవడంతో ఏదైనా ఘటన జరిగినా, అపరిచితులు పోస్టాఫీసు ప్రాంగణానికి వచ్చినా గుర్తు పట్టని పరిస్థితులు ఉన్నాయని పోస్టల్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలనే డిమాండ్ వస్తోంది. అదేతీరుగా శిథిలావస్థకు చేరుకున్న భవనాలకు, అద్దె భవనాల్లో కొనసాగుతున్న పోస్టాఫీసులకు నిధులు మంజూరు చేయించి పక్కా భవనాలు నిర్మించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల క్వార్టర్ల కు తగిన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఉరేసుకుని మహిళ ఆత్మహత్య

భైంసారూరల్(ముథోల్): మండలంలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన ఎడ్కే గంగాసాగరబాయి (44) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గంగాసాగరబాయి కుమారుడు రెండేళ్ల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనకు గురైంది. ఎప్పుడూ కుమారుడిని తలచుకుంటూ బాధపడుతుండేది. బుధవారం మహిళ భర్త గంగాధర్ పని నిమిత్తం ఇంటినుంచి బయటకు వెళ్లాడు. ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

మనోవేదనతో వ్యక్తి ...

బేల(ఆదిలాబాద్): అనారోగ్యంతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై డి.రాధిక తెలిపిన వివరాల ప్రమారం మండలంలోని డోప్టాల గ్రామానికి చెందిన బండి సురేష్ (55)ఎనిమిదేళ్లుగా నరాల బలహీనతతో బాధపడుతున్నాడు. మహారాష్ట్రతో పాటు వివిధ ప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో చూపించినా వ్యాధి నయం కాకపోవడంతో మనోవేదనకు గురయ్యాడు. గురువారం ఉదయం ఇంటి పైకెక్కి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుని కుమారుడు బండి సంగీత్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

బేలలో యువకుడు..

బేల(ఆదిలాబాద్): మండల కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మంత్రి అక్షయ్ (25) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై డి.రాధిక తెలిపారు. ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న అక్షయ్ గురువారం ఉదయం కాలనీ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో పురుగుల మందు తాగి తండ్రికి సమాచారం అందించాడు. వెంటనే కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. మృతుని భార్య సుప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

బజార్‌హత్నూర్(బోథ్): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని భూతాయి(కే) గ్రామానికి చెందిన రైతు పెందూర్ లక్ష్మణ్ (56) గురువారం ఉదయం పశువులను తోలుకురావడానికి చందునాయక్ తాండ వైపు వెళ్లాడు. పద్వల్ సుభాష్‌కు చెందిన మొక్కజొన్న చేనులో వెతుకుతుండగా అడవిపందుల బెడద తప్పించడానికి ఏర్పాటు చేసిన విద్యుత్ జీఐ వైరు కాలికి తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ..

ఆదిలాబాద్‌రూరల్: ఈ నెల 25న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. మావల గ్రామానికి చెందిన మమ్మద్ షరూఫ్‌ఖాన్ (28) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మద్యం సేవించేందుకు కుటుంబ సభ్యులను తరచూ డబ్బులు అడిగేవాడు. నిరాకరించడంతో మనస్తాపం చెందాడు. ఫిబ్రవరి 25న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు తరలించారు. చికిత్సపొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుని తండ్రి మహ్మద్ రజాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. మృతునికి భార్య, కూతురు ఉన్నారు.

వివాదాస్పద స్థలంలో అనుమతి లేదు



వీడీసీ సభ్యులతో చర్చిస్తున్న అదనపు కలెక్టర్

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కొమురంభీం చౌరస్తా సమీపంలో వివాదాస్పద స్థలంలో నిర్మాణాలకు ఎవరికీ అనుమతి లేదని అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, డీఎస్పీ గంగారెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వీడీసీ, ఆదివాసీ సంఘం నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. వివాదాస్పద స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు బాల హనుమాన్ విగ్రహం ప్రతిష్ఠించడంతో గ్రామంలో ఉద్రిక్తత నెలకొనే అవకాశం ఉంది. దీంతో ఇరువర్గాలతో శాంతి చర్చలు జరిపారు. ఆదివాసీలకు మండల కేంద్రంలో స్థలం కేటాయిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అప్పటి వరకు వివాదాస్పద స్థలంలోకి ఎవరూ వెళ్లకుండా 145 సెక్షన్ విధించి, ఆ భూమిని పోలీసులకు అప్పటించనున్నట్లు తెలిపారు. ఈ స్థలంలోకి ఏ వర్గం వెళ్లినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ సర్ఫరాజ్ నావాజ్, ఖానాపూర్ సీఐ బి.మోహన్, ఎస్సై ఎండీ.యాసిర్ ఆరాఫత్, ఆదివాసీలు, వీడీసీ భ్యులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి

తలమడుగు(బోథ్): చేపలు పట్టేందుకు వెళ్లి విద్యుత్‌షాక్‌తో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై ధనశ్రీ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన రేపని లస్మన్న (31) బుధవారం ఉదయం చేపలు పట్టడానికి ఉండం గ్రామ శివారులోని నల్లగుండ్ల వాగులో చేపలు పడుతుండగా అక్కడ ఉన్న విద్యుత్ మోటార్ ద్వారా నీటిలోకి విద్యుత్ సరఫరా కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని భార్య రేపని గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.